క్లుప్తంగా

జూనియర్ కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

సుజాతనగర్: సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గురువారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మండలంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులు సుదూరంలోని కొత్తగూడెం, పరిసర ప్రాంతాల్లోని జూనియర్ కళాశాలల్లో చేరి ఇబ్బందులు పడే పరిస్థితులు, ఆర్థికంగా నష్టపోతుండటంతో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు అధికారులను సంప్రదించి ఒత్తిడి తేవడంతో చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు కళాశాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాలని ఇంటర్మీడియేట్ విద్య డైరెక్టర్ నుంచి ఉన్నత విద్య ప్రిన్సిపాల్ సెక్రటరీ లేఖ రాశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులను ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీచేసింది. కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ సుముఖత వ్యక్తం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జవహర్ జోకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న జవహర్ జో

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సెయింట్ పీటర్స్ స్కూల్ కరస్పాండెంట్ జవహర్ జోకు గౌరవ డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఏసీఈ థియోలజికల్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ విజయ్‌మోహన్‌రావు డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా జోను పలువురు అభినందించారు.

శంకర్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

కొత్తగూడెంఅర్బన్: గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు బూశిరెడ్డి శంకర్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీని ఇచ్చి గౌరవించాలని ట్రస్ట్ జిల్లా కన్వీనర్ చింతలచెరు గెర్షోము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేశారని, 1980 నుంచి విద్యార్థి, యువజన, కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వడం సముచితమన్నారు.

ప్రైవేటీకరణ ప్రయత్నాలను వ్యతిరేకించండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): వీకే-7 ఓసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలను వ్యతిరేకించాలని గుర్తింపు కార్మిక సంఘం బ్రాంచి కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్‌రావు అన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి, ఏజీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీకే-7 ఓసీని ప్రవేట్‌పరం చేసే ప్రయత్నాలను చూస్తు ఊరుకోమని, అగ్రిమెంట్ ప్రకారం ఖచ్చితంగా సింగరేణి సంస్థకు కేటాయించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కుటిల యత్నాలు మాని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, కత్తెర్ల రాములు, గట్టయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు


స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

టేకులపల్లి: టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ఆధ్వర్యంలో మండలంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు తేజావత్ శంభునాయక్ మాట్లాడుతూ.. ఇక రాబోయే ఎన్నిక ఏదైనా బీజేపీ తప్పకుండా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రామ్‌సింగ్, బాలాజీ నాయక్, హత్తీరామ్, సురేష్, అప్పారావు, నరేష్, జమాల్, సురా, పార్వతి, సీతా, సుహాసిని, కుమారి, ఉమా, విజయ, సునిత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు


జూలూరుపాడులోని ఆయిల్‌పామ్ తోటలో మిర్చి సాగు

- గెలలు వచ్చే వరకు రైతులకు అదనపు ఆదాయం
- రెండు, మూడేళ్లు ఇబ్బంది లేకుండా సాగు

జూలూరుపాడు: మండలంలో ఆయిల్‌పామ్ సాగు నానాటికీ పెరుగుతోంది. అటు శాశ్వత ఆదాయం, ఇటు ప్రభుత్వం, అధికారుల విస్తృత అవగాహనతో రైతులు ముందుకొస్తున్నారు. ప్రస్తుతం జూలూరుపాడు మండల వ్యాప్తంగా ఆయిల్‌పామ్ వెయ్యి ఎకరాల్లో సాగవుతోందని అంచనా. అయితే, ఈ పంట నాలుగేళ్ల తర్వాత చేతికి రానుండడంతో అప్పటివరకు రైతులు నష్టపోకుండా అంతర పంటలు సాగు చేస్తున్నారు. తద్వారా భూమిని సద్వినియోగం చేసుకున్నట్లు అవుతుండగా.. అదనపు ఆదాయం లభిస్తోంది.

కూరగాయలతో పాటు మొక్కజొన్న



ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం వస్తోంది. మూడేళ్ల క్రితం మూడెకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటాం. అప్పటినుంచి టమాట, చిక్కుడు, వంగ, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నా. ఆయిల్‌పామ్ గెలల దిగుబడి నాలుగు, ఐదో సంవత్సరం పూర్తిస్థాయిలో వస్తుంది. దీంతో అప్పటివరకు ఇతర పంటలు సాగు లాభదాయకంగా ఉంది.

– ధరావత్ నరసింహరావు, కరివారిగూడెం

ఇప్పుడు మిర్చి, తర్వాత కూరగాయలు



మిర్చి, పత్తి పంటలు సాగు చేసినా అతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్నాం. దీంతో ఏడాదిన్నర క్రితం ఎనిమిది ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాం. అంతేకాక అంతర పంటగా మిర్చి సాగు చేస్తున్నా. వచ్చే ఏడాది కూరగాయాలు సాగు చేయాలని అనుకుంటున్నాం. నాలుగేళ్లకు ఆయిల్‌పామ్ చెట్లు పెరిగి గెలలు వచ్చాక ఇతర పంటల సాగుకు అవకాశముండదు.

– చప్పిడి కృష్ణారావు, వినోభానగర్

రెండు, మూడేళ్లు ఓకే..


కరివారిగూడెంలో సాగు చేసిన చిక్కుడు

ఆయిల్‌పామ్ మొక్కలు నాటాక దిగుబడి నాలుగో ఏడాది నుంచి మొదలవుతుంది. అప్పటివరకు రైతులకు ఆదాయం లభించడం కష్టమవుతోంది. ఈ నేపథ్యాన రెండు, మూడేళ్ల వరకు అందులో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు ముందుగానే అవగాహన కల్పిస్తున్న కారణంగా రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ మేరకు పత్తి, మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ, పెసర, మినుము పంటలే కాక టమాట, వంగ, చిక్కుడు, కాకర వంటి కాయగూరలూ సాగుచేస్తున్నారు. మండలంలోని జూలూరుపాడు, వినోభానగర్, వెంగన్నపాలెం, సాయిరాంతండా, కాకర్ల, కొత్తూరు, పాపకొల్లు, భేతాళపాడు, పడమటనర్సాపురం, మాచినేనిపేటతండా, మాచినేనిపేట, కరివారిగూడెం, కొమ్ముగూడెం, సురారం, తదితర గ్రామాల రైతులు ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటల ద్వారా మంచి లాభాలు ఆర్జిస్తున్నారు.


చిక్కుడు తీగ చూపిస్తున్న రైతు

ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి


మాట్లాడుతున్న సురేష్‌నాయక్

టేకులపల్లి: ఇల్లెందు నియోజకవర్గంలో మద్యం సిండికేట్‌తో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు దారావత్ సురేష్‌నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లిలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... మద్యం సిండికేట్, అధిక ధరలపై అనేక పర్యాయాలు అధికారులకు తెలియజేసినా చర్యలు శూన్యమని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని మద్యం వ్యాపారం కొనసాగుతున్న అధికారులు చూసీ చూడనట్లుగా ఉంటున్నారన్నారు. పంచాయతీల్లో ప్రతీ మారుమూల ప్రాంతాల్లో బెల్ట్ షాపులు అడ్డు అదుపు లేకుండా వెలిశాయని, అధిక రేట్లకు మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల్ని మోసగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్, మండల అధ్యక్షుడు బాణోతు కిషన్, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపల లాలు, మండల కార్యదర్శి లక్పతి నాయక్, ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి నాయక్ ఉన్నారు.

నివాళులర్పించి దేశభక్తిని చాటుదాం..


మాట్లాడుతున్న ప్రదీప్

కొత్తగూడెంఅర్బన్: ఛత్రపతి శంభాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఈనెల 11న పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో నివాళులర్పించి దేశభక్తిని చాటాలని వీర శివాజీ మహారాజ్ సేన అధ్యక్షుడు జోగు ప్రదీప్ అన్నారు. గురువారం పట్టణంలో వివేకానంద యువజన సేవాభారతి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధర్మ రక్షణకు తన ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన గొప్ప యోధుడు శంభాజీ మహారాజ్ అన్నారు. ఈ నెల 11న నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిల్లి రాజేశ్వరరావు, లక్ష్మణ అగర్వాల్, స్వప్న, రాజన్న, దిలీప్, బడే రమేష్, యామిని, గుమలాపురం సత్యనారాయణ, లింగాల విజయ్, అరుణ్, అశోక్, అభిషేక్, గొడుగు శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మరుగుదొడ్ల ధ్వంసంపై ఫిర్యాదు

సుజాతనగర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల ధ్వంసంపై సదరు కాంట్రాక్టర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద నిర్మించిన మరుగుదొడ్లలోని బేసిన్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ రాంసింగ్ తెలిపారు. ఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఎం.రమాదేవి తెలిపారు.

పోగొట్టుకున్న పర్స్ అప్పగింత


పర్సు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్‌లో మహిళ పోగొట్టుకున్న పర్సును ఆర్టీసీ సిబ్బంది గురువారం అందజేసింది. మార్కాపురం విజయ కొత్తగూడెం బస్టాండ్‌లో కూర్చున్న చోట రూ.11 వేలు నగదు, తులంన్నర బంగారు గొలుసు ఉన్న తన పర్సు మరచిపోయి ఖమ్మం వెళ్తున్న ఆర్డినరీ బస్సు ఎక్కింది. ఈ క్రమంలో అక్కడ పర్సును గమనించిన వారు స్థానిక కంట్రోలర్‌కు అందజేశారు. బస్సు ఎక్కిన విజయ సుజాతనగర్ వెళ్లాక పర్సు లేదని గమనించి కండక్టర్‌కు తెలపడంతో కంట్రోలర్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు పర్సు దొరికిందని కంట్రోలర్ తెలపగా విజయను కొత్తగూడెంకు రప్పించి ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ భాగ్యలక్ష్మి, ఆర్టీసీ సిబ్బంది సునీత, విజయ, సునీత, హోమ్‌గార్డు ఆమె పర్సును అప్పగించారు. ఈ సందర్భంగా విజయ ఆర్టీసీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపింది.

ఆర్థికసాయం

పాల్వంచ: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి తిరుమలరావుకు సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుపల్లి సాయిబాబు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ డీఈ స్వరూపారాణి చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి నాగేశ్వరరావు, శనగారపు శ్రీనివాసరావు, వెంకన్న, సత్యనారాయణ, జకరయ్య, పద్మ, లక్ష్మీ, ఆదినారాయణ, శంకర్, వెంకన్న, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

టేకులపల్లి: సీపీఐ మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ కుమారుడు సాయితేజ ఇటీవల మృతిచెందగా ఈ మేరకు గురువారం టేకులపల్లిలోని సబ్‌స్టేషన్ ఏరియాలో ఏర్పాటు చేసిన దశదిన కార్యక్రమంలో పలువురు సాయితేజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, నాయకులు కోరం సురేందర్, సుధాకర్, ఈది గణేష్, సర్దార్, మంగీలాల్, రవి, సుభాష్ ఉన్నారు.

వేడుకలను జయప్రదం చేయాలి

పాల్వంచ: మార్చి 8న భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరగనున్న మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ కోరారు. గురువారం స్థానిక సీఆర్ భవన్ నందు మహిళా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతని చెబుతున్న ప్రభుత్వాలు బడ్జెట్‌లో, నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి పద్మ, దాసరి లక్ష్మి, కమటం ఈశ్వరమ్మ, వగ్గేల పద్మ, భాను, సత్తెమ్మ, అనసూర్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు


సింగరేణి(కొత్తగూడెం): పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఇల్లెందు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. గురువారం ఇల్లెందు జేకే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆటల పోటీలను ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీ ప్రారంభించారు. ఎంపైర్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడుగు వెంకటలక్ష్మీ, నిర్మల, యదళ్లపల్లి అనసూర్య, పాయం స్వాతీ, పాయం లలిత, కల్తీ పద్మ, మోకాళ్ల వెంకటమ్మ, చిల్లా విజయ, వరలక్ష్మీ, పార్వతీ, చెంచమ్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దానియేల్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, మండల రాము, సుదర్శన్‌కోరీ, పూనెం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో మహిళా ఉద్యోగులకు, రామవరం, రుద్రంపూర్, దస్‌బాద్, గౌతంపూర్ సేవా సమితి సభ్యులకు గురువారం ఆటల పోటీలను సేవా సమితి ఆధ్వర్యంలో


ఇల్లెందు: మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళలు

ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా పర్సనల్ డీజీఎం శివకేశవరావు మాట్లాడుతూ... క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని, ప్రతీ ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సుమలత, పర్సనల్ పీఓ ఎం.మురళి, సేవా కో ఆర్డినేటరు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను గుర్తుంచుకోవాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి కీర్తి చంద్రిక రెడ్డి

ఇల్లెందు: మహిళలకు ఎన్నో హక్కులు ఉన్నాయని వాటిని ప్రతీ ఒక్కరు గుర్తుంచుకోవాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రిక రెడ్డి అన్నారు. గురువారం ఇల్లెందులో ఎస్సీ బాలికల హాస్టల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ... అన్ని రంగాల్లో పని చేస్తున్న మహిళలు సాధికారత సాధించిన సందర్భంగా పండుగలా సభలు సమావేశాలు నిర్వహించుకుని ముందుకు సాగే రోజన్నారు. ఈ సందర్భంగా మహిళలకు హక్కులు– విధులు వాటితో ఉపయోగాలు అనే అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు రవి నాయక్, ఉమామహేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ కృష్ణవేణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలి


సిబ్బందికి సూచనలు చేస్తున్న శేషాంజన్‌స్వామి

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. గురువారం పట్టణంలోని బూడిదగడ్డ, చుట్టు పక్కల ఏరియాల్లో జరిగిన కుక్కల పట్టివేతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఇబ్బందులు ఏర్పడకుండా స్థానిక శానిటరీ జవాన్‌లు, ఇన్‌స్పెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పట్టిన కుక్కలను జంతు జనన నియంత్రణ ఆపరేషన్ కోసం రైటర్‌బస్తి, గొల్లగూడెం యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి, జంతు జనన నియంత్రణ ఆపరేషన్‌ను చేసి వదిలివేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ, పరిశుభ్రత పాటించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమిషనర్

ఇల్లెందు: వంటమాస్టర్లు సరైన శిక్షణ లేని కారణంగా రుచిగా వండటం లేదని, మెనూ పాటించాలని, హాస్టల్ ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇల్లెందు ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఏటీడీఓ రాధ అన్నారు. ఈ మేరకు ఇల్లెందు పట్టణంలోని కోర్టు ఏరియాలో గల ఎస్టీ బాలుర హాస్టల్, ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి మెనూ అమలు తీరును పరిశీలించారు. హాస్టల్, ఆశ్రమ పాఠశాలలో సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశార. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి చదువు కోసం వచ్చిన మీరు క్రమశిక్షణతో మెలగాలని, చదువు, ఆట పాటలతో ముందుకు సాగాలన్నారు. ఆయన వెంట ఎస్టీ హాస్టల్ వార్డెన్ భరత్ తదితరులు ఉన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేయాలి

తడి, పొడి చెత్తను వేరుచేయడంతో ఎన్నో లాభాలున్నాయని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఇల్లెందులోని 10వ వార్డులో తడి పొడి చెత్త వేరు చేయటం మీద అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంట్లోనే మహిళలు తడి, పొడి చెత్తను వేరు చేసి అందజేస్తే తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువును తయారు చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాల్యా, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అతహార్, టీఎంసీ నాగయ్య, సీఓలు నాగమణి, నాజర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు సైడ్‌బర్మ్..


ఇరువైపులా మట్టి పోసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండలంలోని సంపత్‌నగర్‌లో సీసీ రోడ్లకు ఇరువైపులా గురువారం సైడ్‌బర్మ్ పోశారు. ఈ మేరకు మండలంలో 36 పంచాయతీల్లో సీసీ రోడ్లకు సైడ్‌బర్మ్ పోయకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందని ఈ నేపథ్యంలో ఈ నెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన 'సైడ్‌బర్మ్ పోయరా..?' కథనానికి అధికారులు స్పందించి సైడ్‌బర్మ్ పోయించారు. అయితే మెత్తని మట్టి పోస్తే ఇబ్బంది అవుతుందని, గట్టి మొరం పోయాలని అలాగే మిగిలిన రోడ్లకు కూడా సైడ్‌బర్మ్ పోయాలని స్థానికులు కోరుతున్నారు.

సభను జయప్రదం చేయండి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న సావిత్రి

ఇల్లెందురూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 8న పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షురాలు యదళ్లపల్లి సావిత్రి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ.. తమ రక్తాన్ని చిందించి సాధించుకున్న హక్కుల దినోత్సవంగా అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవాన్ని మహిళలు జరుపుకోవాలన్నారు. హక్కుల పరిరక్షణ, సాధన కోసం మహిళలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భూక్య విజయ, రమాదేవి, పద్మ, లక్ష్మి, చిలకమ్మ, సుజాత, శోభ, సావిత్రి, రాములమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ఉమ

పాల్వంచరూరల్: ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని స్త్రీ, పురుష సమానత్వానికి ఉద్యమించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు వీరమళ్ల ఉమ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ప్రభాత్ నగర్‌లో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా దిన శ్రామిక మహిళలు పోరాటదినంగా భావించి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించాలన్నారు. బుడిగం కొమరమ్మ, కళ్లెం పద్మమ్మ, జక్కుల గంగమ్మ, శైలజ, మడివి గంగా, సుజాత, బుర్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు ప్రారంభం


టేకులపల్లి: పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు


పాల్వంచరూరల్: తనిఖీ చేస్తున్న సిబ్బంది

టేకులపల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 117 మంది రాయాల్సి ఉండగా 112 మంది హాజరయ్యారని సీఎస్ కె.బసవమ్మ, డీఓ కె.ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు పరీక్షాకేంద్రంలో ఎస్సై పోగుల సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. అదేవిధంగా సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

పాల్వంచరూరల్: మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. నాలుగు కేంద్రాల్లో మొత్తం 975 మంది విద్యార్థులకుగాను 954 మంది హాజరుకాగా 21 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తనిఖీలు చేశారు.